ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

ఏకసభ్య కమిషన్‌కు సంఘాల వినతి

హైదరాబాద్, డిసెంబర్13 (నమస్తే తెలంగాణ): సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు కాకుండా, విచక్షణా అధికారాలను ఉపయోగించి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఏకసభ్య కమిషన్‌కు కుల నిర్మూలన వేదిక, తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం నేతలు విజ్ఞప్తి చేశారు. బీఆర్కే భవన్‌లోని ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌ను శుక్రవారం ఆయా సంఘాల నేతలు ప్రత్యేకంగా కలిశారు. 2011తోపాటు 2014 సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు, ఇటీవల నిర్వహించిన కులగణన వివరాలను పరిగణలోకి తీసుకుని ఎస్సీ వర్గాల రిజర్వేషన్ కోటాలను నిర్ణయించాలని కోరారు.

వేం నరేందర్‌రెడ్డి కుమారుడికి చుక్కెదురు

- ఈడీ నోటీసుల కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో వేం నరేందర్‌రెడ్డి కుమారుడు కృష్ణకీర్తన్‌కు చుక్కెదురైంది. ఈ కేసులో ఆయనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీచేసిన నోటీసులను కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. సీఎం రేవంత్‌రెడ్డి గతంలో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ ఓటును కొనుగోలు చేసేందుకు రూ.50 లక్షల ముడుపులు చెల్లిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం విదితమే. ఆ ముడుపులను కృష్ణకీర్తన్ సమకూర్చినట్టు ఈడీ చార్జిషీట్ దాఖలు చేయడంతో 2021 ఆగస్టు 9న ఆయనకు ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది.ఆ సమన్లను కొట్టివేయాలంటూ కృష్ణకీర్తన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ కే లక్ష్మణ్.. కృష్ణకీర్తన్ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు.

కంచె ఐలయ్యపై కేసుల కొట్టివేత

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'సామాజిక స్మగ్లర్లు కోమటోళ్లు' అనే పుస్తకాన్ని రాసిన ప్రొఫెసర్ కంచె ఐలయ్యకు న్యాయస్థానం లో ఊరట లభించింది. ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసేలా ఈ పుస్తకాన్ని రాశారంటూ కోరుట్ల, కరీంనగర్ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. వాటిని రద్దు చేయాలని హైకోర్టును ఆశ్రయించగా జస్టిస్ రాధారాణి శుక్రవారం ఆయనకు అనుకూలంగా తీర్పు చెప్పారు.

• కూలీలైన విద్యార్థులు...!

వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల పరిధిలోని జీవన్గి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు దగ్గరుండి విద్యార్థుల చేత పనులు చేయించారు. మధ్యాహ్నం 2:30 గంటల ప్రాంతంలో ఓ ఉపాధ్యాయుడు చేతిలో బెత్తం పట్టుకుని పిల్లలను గద్దిస్తూ పనులు చేయించడం కనిపించింది. విలేకర్లు ఫొటోలు తీయడం చూసి ఉపాధ్యాయులు బయటికి వచ్చి విశ్రాంతి సమయం ఉన్నందునే వేరే గదిలోంచి మరోగదిలోకి సామగ్రిని, పరికరాలను తీయిస్తున్నట్టు చెప్పారు. పిల్లల చేత పనులు చేయించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

– బషీరాబాద్

• వైద్య సేవలు మరిచి.. నృత్యాల్లో మునిగి!

దవాఖానలో రోగికి వైద్య సేవలందించాల్సిన నర్సులు విధులను మరిచి ఏకంగా రోగుల పక్కనే డ్యాన్సులు చేస్తూ దర్శనమిచ్చిన ఘటన జగిత్యాల జిల్లా ప్రధాన దవాఖానలో జరిగింది. ఆర్ఎంవో సుమన్‌ను వివరణ అడుగగా, క్రిస్మస్ వేడుకల కోసం రిహార్సల్ చేసుకునేందుకు నర్సుల కోరిక మేరకు తానే అనుమతి ఇచ్చానని తెలిపారు. నర్సులు, వైద్య సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి దవాఖాన సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

– జగిత్యాల అర్బన్

క్యాబినెట్ విస్తరణపై చర్చ జరగలేదు

- క్యాబినెట్ విస్తరణ జరగాలంటే పీసీసీ చీఫ్, డిప్యూటీ సీఎం, ముఖ్యనేతలతో చర్చించాలి
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్
- కేంద్రమంత్రులను కలిసి పలు విజ్ఞప్తులు



కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీలు

హైదరాబాద్, డిసెంబర్13(నమస్తే తెలంగాణ): ఢిల్లీ పర్యటన సందర్భంగా క్యాబినెట్ విస్తరణపై పార్టీ పెద్దలతో ఎటువంటి చర్చ జరగలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. సీఎం ఢిల్లీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర క్యాబినెట్ విస్తరణపై చర్చ జరుగుతుందనే ఊహాగానాలు వెలువడిన నేపథ్యంలో మీడియా ప్రతినిధిలు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. క్యాబినెట్ విస్తరణ జరగాలంటే పీసీసీ చీఫ్, డిప్యూటీ సీఎంతోపాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో చర్చించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒకవైపు సీరియస్‌గా పార్లమెంట్ సమావేశాలు, మరోవైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో క్యాబినెట్ విస్తరణ మీద చర్చ పెట్టలేమని అన్నారు.

1,800 కోట్ల గ్రాంట్ విడుదల చేయండి

ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. తొలుత కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో పార్లమెంటులోని ఆమె చాంబర్‌లో భేటీ అయ్యారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న విధంగా తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలకు నాలుగేండ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్ల గ్రాంట్‌ను వెంటనే విడుదలచేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన తర్వాత హైదరాబాద్‌లోని హైకోర్టు, రాజ్‌భవన్, లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, జ్యుడీషియల్ అకాడమీ సహా ఇతర ఉమ్మడి సంస్థల నిర్వహణను తెలంగాణ ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సంస్థల విభజన పూర్తయ్యే వరకూ నిర్వహణకు అయిన ఖర్చులు రూ.703.43 కోట్లను తెలంగాణ ప్రభుత్వమే భరించిందని.. అందులో ఆంధ్రప్రదేశ్ వాటాగా రూ.408.49 కోట్లను తెలంగాణకు చెల్లించాల్సి ఉన్నదని వివరించారు. విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి ఏపీ, తెలంగాణ మధ్య రుణాల పంపిణీ విషయంలో తెలంగాణ నుంచి ఏకపక్షంగా రూ.2,547.07 కోట్లను కేంద్రం రికవరీ చేసిందని నిర్మల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. పునర్విభజన చట్టంలోని జనాభా ప్రాతిపదికన ఏపీ నుంచి రూ.495.20 కోట్లను సర్దుబాటు చేయాల్సి ఉన్నదని ఆమెకు వివరించారు.

కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వేకోచ్ ఫ్యాక్టరీ పెట్టండి

అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిశారు. వరంగల్ జిల్లా కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వేకోచ్ ఫ్యాక్టరీని నెలకొల్పాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు. డోర్నకల్–మిర్యాలగూడ, డోర్నకల్–గద్వాల ప్రతిపాదిత రైలు మార్గాలను పునఃపరిశీలించాలని కోరారు. ఇక్కడ భూసేకరణ భారమవుతుండటంతో ప్రతిపాదిత మార్గాలను డోర్నకల్ నుంచి వెన్నారం–మన్నెగూడెం–అబ్బాయిపాలెం–మరిపెడ మీదుగా మోతె వరకు మార్చాలని కోరారు. వికారాబాద్–కృష్ణాస్టేషన్ మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలు మార్గం నిర్మించాలని కోరారు. సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య, రఘువీర్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, వంశీకృష్ణ, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్ ఉన్నారు.

మంత్రి సురేఖ క్షమాపణ చెప్పాలి

- పత్రికలు, నాయకులపై కేసులు పెడ్తామని మంత్రి బెదిరిస్తున్నారు
- కోడెల విక్రయాలపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి
- విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు

గీసుగొండ, డిసెంబర్ 13 : అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో రాజన్న కోడెల విక్రయ కేసును పక్కదారి పట్టించేందుకు యత్నిస్తున్నారని, దీనిపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్‌రావు, రాష్ట్ర నాయకుడు విజయచందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ ధర్మారం శివారులో బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి సురేఖ సిఫారసు మేరకు ఆలయ అధికారులు 66 కోడెలను రాంబాబు, మందస్వామి, పసునూటి శ్యామ్‌సుందర్‌కు ఇచ్చినట్టు పోలీసుల విచారణలో బయటపడిందని చెప్పారు. దీనికి దేవాదాయ శాఖ మంత్రి బాధ్యత వహిస్తూ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ అధికారులు నిబంధనలను పాతరేసి, కాసులకు కక్కుర్తి పడి ఓ వ్యక్తికి 66 కోడెలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి స్పందించాలని కోరారు. వేములవాడ ఈవోను సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తప్పును ఒప్పుకోకుండా ఆ విషయాలను వెలుగులోకి తెచ్చిన పత్రికలపై కేసులు పెడతామని బెదిరించడం ఆమె అహంకారానికి నిదర్శనమని చెప్పారు. ఈ విషయంపై గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని తెలిపారు.

జానారెడ్డి ఇంటికే మార్కింగ్!

మొదటిపేజీ తరువాయి...

ప్రాంతాల్లో భూ పరీక్షలు జరిపే ప్రాంతాలను గుర్తించిన అధికారులు మార్కింగ్ ప్రక్రియ చేపట్టారు. గత ఆరు రోజులుగా ముమ్మరంగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ఉన్న మాజీ మంత్రి జానారెడ్డి ఇంటికి సంబంధించిన కాంపౌండ్ వాల్‌తోపాటు జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లోని బాలకృష్ణ ఇంటి భాగంలో కొంత మేర భూ సేకరణ కింద పోతుందని అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కింగ్ చేసేందుకు వెళ్లిన అధికారులతోపాటు ప్రభుత్వంలోని ముఖ్యనేతలపై జానారెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేయడమే కాకుండా, తన భూమి ఇచ్చేది లేదని తేల్చి చెప్పినట్టు సమాచారం. మరోవైపు బాలకృష్ణ సైతం తన స్థలంలో భూసేకరణను వ్యతిరేకిస్తున్నట్టు తెలుస్తున్నది. వీరితోపాటు ఈ ప్రాజెక్టు ప్రాంతంలో మరికొందరు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖుల ఆస్థులు ఉండటంతో భూసేకరణ వ్యవహారం పెద్ద సవాలుగా మారుతున్నది.

కత్తి మీద సాములా భూ సేకరణ

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కేబీఆర్ పార్కు చుట్టూ రహదారి విస్తరణ చేపట్టాల్సి ఉన్నది. టీడీపీ కార్యాలయం పక్కన మినహా చుట్టూ రోడ్డును విస్తరించనున్నారు. ప్రస్తుతం వంద అడుగుల మేర ఉన్న రోడ్డును 120 అడుగులకు విస్తరించనున్నారు. ఈ రహదారి కింద మార్గంలో అండర్‌పాస్‌లు, పైన స్టీల్‌బ్రిడ్జిలతోపాటు 120 అడుగుల రోడ్డు కార్యరూపం దాలిస్తే కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్య ఉండదని భావిస్తున్నారు. రహదారి విస్తరణకు 87 ఆస్తులను సేకరించనున్నారు. కేబీఆర్‌పార్కు చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు మీదుగా రోడ్డు నంబర్ 45లోని బాలకృష్ణ ఇంటివైపు, సీవీఆర్‌న్యూస్ చానల్ చౌరస్తా, భారతీయ విద్యాభవన్స్ స్కూల్ వైపు, అగ్రసేన్ చౌరస్తా, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 వైపు ఈ ఫ్లై ఓవర్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం కోసం డిజైన్లు పూర్తి చేశారు. ఎక్కడెక్కడ పిల్లర్లు నిర్మించాలో ఆ ప్రాంతాల్లో మార్కింగ్ పూర్తి చేశారు. ప్రాథమికంగా భూ పరీక్షలు పూర్తయిన తర్వాత పిల్లర్ల నిర్మాణానికి శ్రీకారం చుడతారు.

8 స్టీల్ బ్రిడ్జిలు, 6 అండర్‌పాస్‌లు

కేబీఆర్ పార్కు చుట్టూ అగ్రసేన్, ఫిలింనగర్, క్యాన్సర్ దవాఖాన, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం ఇలా ఆరు జంక్షన్లు ఉన్నాయి. ఈ జంక్షన్లలో ఎనిమిది స్టీల్‌బ్రిడ్జిలు, ఆరు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. జూబ్లీహిల్స్ జంక్షన్, కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ వద్ద రెండు చొప్పున నాలుగు స్టీల్‌బ్రిడ్జిలు రానున్నాయి. మిగతా నాలుగు జంక్షన్ల వద్ద ఒక్కో స్టీల్‌బ్రిడ్జి చొప్పున, ఆరు జంక్షన్ల వద్ద ఒక్కొక్కటి చొప్పున ఆరు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. చిరంజీవి బ్లడ్‌బ్యాంకు నుంచి రోడ్డు నెంబర్ 45 వైపు వచ్చే ఫ్లై ఓవర్‌పై భాగంలో రెండు లేన్లతో రానున్నది. కేబీఆర్ పార్కు నుంచి రోడ్ నంబర్ 36 వైపు వెళ్లే నాలుగు లేన్ల కింద నుంచి వెళ్లనున్నది. ఆయా నిర్మాణాలతో కేబీఆర్ పార్కు గ్రీనరీపై ప్రభావం పడుతుందని అభ్యంతరం వ్యక్తంచేస్తూ గతంలో పలువురు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించారు. అయితే, గ్రీనరీపై ఎటువంటి ప్రభావం పడకుండా పనులు చేస్తామని, చెట్లు తొలగించాల్సి వస్తే ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తామని అధికారులు చెప్తున్నారు.

2030 నాటికి 20 గిగావాట్ల గ్రీన్ పవర్

నేటి నుంచి 20 వరకు విద్యుత్తు పొదుపు వారోత్సవాలు: భట్టి

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): 2030 నాటికి 20 గిగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ నెల 14 నుంచి 20 వరకు రాష్ట్రంలో విద్యుత్తు పొదుపు వారోత్సవాలను నిర్వహించనున్నామని తెలిపారు. శుక్రవారం ప్రజాభవన్‌లో విద్యుత్తు పొదుపు క్యాలెండర్‌ను భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్‌కోడ్‌ను అమలుచేస్తున్నామని, 879 భవనాలకు కోడ్ అమలు చేయడంతో 392.21 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఆదా అయ్యిందని చెప్పారు. పాత విద్యుత్తు పరికరాల స్థానంలో ఎల్‌ఈడీ తీసుకురావడంతో 2.87 మిలియన్ యూనిట్లు ఆదా అయ్యిందని వెల్లడించారు. తెలంగాణ గతంలో మూడు సార్లు జాతీయ పొదుపు అవార్డులను అందుకున్నదని గుర్తుచేశారు.

సర్వేలో పాల్గొనండి ప్లీజ్!

- వివరాల నమోదుకు నగరవాసుల వెనకడుగు
- ప్రజలంతా పాల్గొనాలని మంత్రి పొన్నం విజ్ఞప్తి

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఇంటింటి సర్వేలో పాల్గొని వివరాలను నమోదు చేసుకునేందుకు నగరంలోని కాలనీవాసులు వెనకడుగు వేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. వివరాలు నమోదు చేసుకోని వారు ఇప్పటికైనా సర్వేలో పాల్గొనాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులతో మంత్రి పొన్నం సచివాలయం లో శుక్రవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇంటింటి కుటుంబ సర్వే పరిస్థితిపై చర్చించారు. సర్వేలో సమాచారమివ్వని కుటుంబాలు కూడా తమ వివరాలను నమోదు చేసుకునేలా కుల సంఘాలు, కమిషన్ చొరవ తీసుకోవాలని మంత్రి తెలిపారు. కులాల వారీగా సంఖ్య తేలకపోతే పథకాలు అందకపోవడమేగాక, రిజర్వేషన్ల సంఖ్య తగ్గే అవకాశముంటుందని వెల్లడించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్‌కు కులసంఘాల వినతి

బీసీ కమిషన్ చైర్మన్‌ను బుడబుక్కల, మేర, కుమ్మరి, రజక కుల సంఘాల ప్రతినిధులు కలిశారు. తమ కులం పేరును ఆరె క్షత్రియగా లేదంటే శివక్షత్రియ కులంగా మార్చాలని బుడబుక్కల, చిప్పోలు (మేర)గా ఉన్నదాన్ని మేర (చిప్పోలు)గా మార్చాలని, తమ కులానికి ప్రజాపతి పదాన్ని పర్యాయపదంగా చేర్చాలని మేర కులస్తులు, దోబీ పదాన్ని చేర్చాలని రజక కులస్తులు విజ్ఞప్తి చేశారు. కుల సంఘాల ప్రతినిధులు ఆవుల మహేశ్, లక్ష్మణ్ రావు, సంగ వెంకట రాజం, రాయబారపు సంతోష్, బాలకిషన్ ప్రజాపతి, పావని రవీందర్ ప్రజాపతి, శ్రీలక్ష్మి, మల్లేశ్ కుమార్, చల్ల వీరేశం చైర్మన్‌ను కలిశారు.

కోతులను నియంత్రించండి: మంత్రి సురేఖ

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తేతెలంగాణ): వన్యప్రాణుల జాబితా నుంచి కోతులను తొలగించారని, కాబట్టి జనావాసాల్లో వీటి బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో 'జూస్ అండ్ పార్క్ అథారిటీ ఆఫ్ తెలంగాణ' (జాపాట్) 13వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'జూ పార్కులు, అర్బన్ ఫారెస్ట్ పార్కులలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. వరంగల్‌లోని కాకతీయ జూపార్కుకు రెండు తెల్ల పులులు, సింహాన్ని తెప్పించడానికి సెంట్రల్ జూ అథారిటీని అధికారులు సంప్రదించాలి' అని సూచించారు.

వాయుకాలుష్యాన్ని అరికడుదాం

రాష్ట్రంలో వాయుకాలుష్యాన్ని నియంత్రించడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సురేఖ సూచించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌పై జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ బొగ్గును ఇంధనంగా ఉపయోగించే పరిశ్రమలు ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు దృష్టి సారించాలని కోరారు.

సర్కారు స్కెచ్.. బూమ'రాంగ్'

మొదటిపేజీ తరువాయి...

కార్యాలయం ఆ లేఖను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కార్యాలయానికి ఫార్వర్డ్ చేసి, విచారణకు ఆదేశించడంతో కేంద్ర జీఎస్టీ విభాగం అప్రమత్తం అయింది. రాష్ట్రంలో సీఐడీ దర్యాప్తు జరుగుతుండగానే సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) అధికారులు ఎంట్రీ ఇచ్చారు. పన్ను ఎగవేతలకు పాల్పడిన సంస్థలు, వ్యక్తుల జాబితాతోపాటు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) దుర్వినియోగం వివరాలు ఇవ్వాలని కోరడంతో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులు కంగుతిన్నారు. కమిషనర్ రూపొందించిన నివేదిక ప్రకారం.. పన్ను ఎగవేతల్లో రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్, ట్రాన్స్‌కో, ఎల్ఐసీ, ఎన్ఎండీసీలదే సింహభాగం. ఈ నాలుగు ప్రభుత్వరంగ సంస్థలు కలిపి రూ.1,000 కోట్లు ఎగ్గొట్టినట్టు ఆ నివేదికలో పేర్కొన్నారు. దీని ఆధారంగా ఇప్పుడు సీజీఎస్టీ అధికారులు తమ వాటా ఇవ్వాలని అడుగుతున్నారు.

ఆ రూ.45.67 కోట్ల సంగతేంటి?

మరో కేసులో కొందరు 7 బోగస్ సంస్థలను సృష్టించారని, భౌతికంగా వస్తు రవాణా జరకున్నా జరిగినట్టు నకిలీ టాక్స్ ఇన్వాయిస్‌లు సృష్టించి జీఎస్టీ కౌన్సిల్ ఖాతాల నుంచి రూ.45.67 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేశారని, ఈ వ్యవహారంలో కూడా ఆ నలుగురు అధికారుల ప్రమేయం ఉన్నదని జాయింట్ కమిషనర్ రవి ఫిర్యాదు చేశారు. దీనిపై సీజీఎస్టీ అధికారులు ఆయనను ప్రశ్నించడంతో తన వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, కమిషనర్ శ్రీదేవి చెబితేనే ఫిర్యాదు చేశానని, అంతకుమించి తనకేం తెలియదని చెప్పినట్టు తెలిసింది. దీంతో ఎలాంటి పురోగతి లేకుండా ఉత్తచేతులతో తిరిగి వెళ్లిపోయిన సీజీఎస్టీ అధికారులు.. తెలంగాణ వాణిజ్య శాఖలో ఏదో జరుగుతున్నదని, దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని పీఎం కార్యాలయానికి లేఖ రాసినట్టు సమాచారం. దీంతో బెంబేలెత్తిన రాష్ట్ర ప్రభుత్వం.. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవిని విధుల అప్రాధాన్య పోస్టుకు బదిలీ చేసింది. మరో పోలీస్ అధికారిని భాధ్యునిగా చేస్తూ ఆయనను విధుల నుంచి తప్పించింది. అనంతరం ఆయా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పొరపాటు జరిగిందని, వాస్తవానికి ఎలాంటి పన్ను ఎగవేతలు జరగలేదని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను బదిలీ చేశామని కేంద్రానికి నివేదించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కానీ, ఆ లేఖతో సీజీఎస్టీ అధికారులు సంతృప్తి చెందలేదని, నకిలీ ఇన్వాయిస్‌లతో క్లెయిమ్ చేసిన రూ.45.67 కోట్లను ఎవరు తిరిగి ఇస్తారో తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడంతోపాటు జీఎస్టీలో కేంద్రం వాటాను ఎగ్గొట్టేందుకు రాష్ట్ర స్థాయిలో కుట్ర జరుగుతున్నదని అనుమానం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మరోవైపు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ దుర్వినియోగంపై సీబీఐతో దర్యాప్తు జరిపించేందుకు 'కాగ్' సిద్ధమవుతుండటంతో ఈ ఉపద్రవం నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియక రేవంత్‌రెడ్డి సర్కారు తర్జనభర్జన పడుతున్నది. వాణిజ్య పన్నుల శాఖ అధికారుల నిర్వాకం వల్ల రాష్ట్ర ప్రభుత్వ పరువు మంటగలవడంతోపాటు రూ.700 కోట్ల డబ్బు కూడా పోయే అవకాశం ఉన్నదని ఆందోళన చెందుతుండటంతో ఈ గండం నుంచి బయపడేందుకు అధికారులు మార్గాలను అన్వేషిస్తున్నారు. కాగా, పీఎం కార్యాలయానికి లేఖ రాసినట్టు అనుమానిస్తున్న ఇద్దరు అధికారులను బదిలీ చేసినట్టు వాణిజ్య పన్నుల శాఖలో చర్చ జరుగుతున్నది.

ఎక్సైజ్ సిబ్బంది కష్టపడి పనిచేయాలి: జూపల్లి

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఎక్సైజ్ సిబ్బంది కష్టపడి పనిచేయాలని మంత్రి జూ పల్లి కృష్ణారావు సూచించారు. శుక్రవారం అబ్కారీ భవన్‌లో పలు విభాగాల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ విభాగాల పనితీరును అధికారులు మంత్రికి వివరించారు.

'కాజీపేట' పనుల్లో వేగం పెంచండి: జీఎం

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కాజీపేట రైల్ కోచ్ ఫ్యాక్టరీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. శుక్రవారం కాజీపేట యూనిట్‌ను సందర్శించిన ఆయన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అధికారులకు భద్రతాపరమైన సూచనలు చేశారు.

బాలికపై అఘాయిత్యం.. దాడిలో నిందితుడు మృతి

రెడ్యానాయక్ (ఫైల్)

రెంజల్, డిసెంబర్ 13:నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం వీరన్నగుట్ట తండాలో బాలికపై ఓ వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు దాడి చేశారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తండాలో రెడ్యానాయక్ (50) కిరాణ షాపు నడిపిస్తున్నాడు. ఎనిమిదేళ్ల బాలిక గురువారం షాపునకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా, రెడ్యానాయక్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటికే కోపోద్రిక్తులైన బాధితురాలి కుటుంబ సభ్యులు రెడ్యానాయక్‌పైనా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు క్షతగాత్రుడిని జిల్లా దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు బాలికపై ఇంటిపైకి దాడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ట్రెయినీ ఎస్సీ ప్రశాంత్ కిశోర్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పరిస్థితిని పర్యవేక్షించారు.

నత్తనడకన ఎల్ఆర్ఎస్!

- మార్చి నెలాఖరు నాటికి 10వేల కోట్ల టార్గెట్
- అదనపు భారంలో మున్సిపల్, పంచాయతీరాజ్ ఉద్యోగులు

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది. వచ్చే ఏడాది మార్చి నాటికి రూ.10వేల కోట్లు వసూలు చేయాలని ఉన్నతాధికారులు మున్సిపాలిటీతోపాటు పంచాయత